



## ఆదరించారు.. అన్నం పెట్టారు..

డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేసే రోజుల్లో ‘పెండ్లి చేసుకో’ అని ఇంట్లోవాళ్లు అడిగేవారు. యాత్రంతా పూర్తయ్యాకే పెండ్లి చేసుకుంటానని చెప్పాను. మనసులో బలంగా అనుకుంటే ఎన్ని ఆటంకాలు ఎదురైనా.. అనుకున్న లక్ష్యం సాధించగలం. ఈ యాత్రలో నన్ను ఎందరో ఆదరించారు. రోజుల తరబడి ఆతిథ్యం ఇచ్చినవాళ్లూ ఉన్నారు. రిషికేశ్‌లో రామ్‌జూలా వంతెన దగ్గర డ్రాయింగ్ చేస్తుంటే.. గుజరాతీ పర్యాటకులు పరిచయం అయ్యారు. నా కథ తెలుసుకొని.. గుజరాత్‌కు వచ్చినప్పుడు తప్పకుండా కలవమని ఫోన్ నెంబర్ ఇచ్చారు. నేను ఆ రాష్ట్రానికి వెళ్లినప్పుడు.. వాళ్లకు ఫోన్ చేశాను. వారం రోజులు వాళ్ల ఇంట్లో ఆతిథ్యం ఇచ్చారు. జైన దేవాలయాలన్నీ తిప్పి చూపించారు. రాజస్థాన్లోనూ ఓ కుటుంబం ఎంతో ఆదరించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఓ యువతి పరిచయమైంది. వాళ్ల ఇంట్లో పెద్దలను ఒప్పించి.. పది రోజులు ఆశ్రయమిచ్చింది. ఇలా నా కళాయాత్ర ఆద్యంతం ప్రేమాభిమానాల మధ్య సాగింది. మా అవ్వ మాత్రం ‘పోచులు.. గడియ రికం లేదు.. గవ్వ అచ్చుడు లేదు’ (తీరిక లేకుండా తిరుగుతున్నావ్ కానీ, రూపాయి ఆదాయం లేదు) అనేది.









వెళ్లాను. అక్కడినుంచి కళాయాత్రకు శ్రీకారం చుట్టాను. ధర్మశాలలు, సత్రాల్లో బస చేసేవాణ్ని. కాశీలో సత్రాల అరుగు మీద కూర్చుని.. అక్కడి గుళ్లూ, గోపురాల బొమ్మలు గీసేవాణ్ని. ప్రయాణంలో ఏది దొరికితే అది ఎక్కి వెళ్లేవాణ్ని. ఏది దొరికితే అది తినేవాణ్ని. పట్టణాలు, పల్లెలు, గిరిజన గూడేలు, ప్రాచీన ఆలయాలు, పురాతన కట్టడాలు ఇలా ఎన్నో ప్రాంతాలను సందర్శించాను. ఎక్కడికి వెళ్లినా.. అక్కడివారితో మాట్లాడతాను. వారి ఆచారాలు, ఆహార్య వ్యవహారాలు పరిశీలిస్తాను. మనసుకు నచ్చితే ఆ సన్నివేశాన్ని కాన్వాసుపై బొమ్మగా మలిచి.. అక్కడినుంచి మరో మజిలీకి బయల్దేరుతాను. నేను అనుకున్న మార్గమంతా తిరిగి రావడానికి ఐదు నెలల సమయం పట్టింది. అలా నా కళాయాత్ర మొదటి అంకం ముగిసింది. అప్పటికే నా దగ్గరున్న డబ్బులన్నీ ఖర్చయ్యాయి.

**రెండో యాత్రకు..**


ఎంత చూసినా తరగని గని భారతావని. మరో యాత్రకు శ్రీకారం చుట్టాలని భావించాను. హైదరాబాద్‌లో ట్యూషన్లు చెప్పి కొంత డబ్బు సమకూర్చుకున్నా. మా తమ్ముడు కొంత ఆర్థిక సాయం చేశాడు. జమ్ముకశ్మీర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ మీదుగా రెండో యాత్ర మొదలుపెట్టాను. నదులు, అడవులు, పల్లెలు, పట్టణాలు తిరిగాను. భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించాను. నేను పొందిన అనుభూతి నా చిత్తరువుల్లో కనిపిస్తుంది. మూడో యాత్రలో భాగంగా తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ దర్శించాను. నాలుగో విడతలో ఈశాన్య రాష్ట్రాలన్నీ చుట్టేశాను. అక్కడి వాతావరణ పరిస్థితులు విభిన్నంగా ఉండేవి. చిరపుంజి లాంటి ప్రదేశాల్లో రోజుల కొద్దీ గడపాల్సి వచ్చేది. కొన్ని రోజులు ఆగుతూ, ఇంకొన్ని రోజులు ముందుకు సాగుతూ ఈ యాత్ర సుదీర్ఘకాలం కొనసాగింది. ఐదో యాత్రలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ చూశాను.

**నన్ను మలచిన యాత్ర**

ఈ యాత్ర చేసే రోజుల్లో ఆయా ప్రాంతాల్లోని ఫైన్ ఆర్ట్స్ కళాశాలలకు వెళ్లాను. బరోడా ఎం.ఎస్. ఫైన్ ఆర్ట్స్ కళాశాల, శాంతినికేతన్ (కోల్‌కతా), జేజే స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (మహారాష్ట్ర) ఇలా ఎన్నో దర్శించాను. అక్కడి విద్యార్థులతో మాట్లాడాను. కొందరు అధ్యాపకులు పుస్తకాలు, డబ్బులు ఇచ్చారు. ఈ యాత్రల్లో మొత్తంగా పది వేల వరకు డ్రాయింగ్స్ గీశాను. వాటిని మోయడం కష్టమే కదా! అందుకే, ఎప్పటికప్పుడు పోస్టులో మా ఇంటికి పంపేవాణ్ని. వాటిలోంచి ఓ రెండు వందల బొమ్మలతో హైదరాబాద్‌లో ఓ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నాను. నేను చూసిన దేశాన్ని, నాకు అర్థమైన భారతాన్ని అందరికీ చూపించాలని భావిస్తున్నా! కళాకారుడు ఎలా పరిణతి సాధిస్తాడో నా కళాయాత్ర చెబుతుందని విశ్వసిస్తున్నా! ■








... నాగవర్ధన్ రాయల
జి. భాస్కర్